

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 1, ప్రభాతవార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 399 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 42.206టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50, ఎన్ఎఫ్‌సికి 300 , పెన్నా డెల్టాకు 3150, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.680 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# పురిటిగడ్డ రుణం తీర్చుకుంటాం

- నెల్లూరు 54వ డివిజన్లో పర్యటించిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
- జనార్ధన్‌రెడ్డి కాలనీలో కోటి రూపాయలతో షాదీ మంజిల్‌కు భూమి పూజ
- మంత్రి నారాయణ రూ. 50 లక్షలు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూ. 50 లక్షలు మొత్తం కోటి రూపాయలతో పనులకు శ్రీకారం
- త్వరలో సీఎం చేతుల మీదుగా భగత్ సింగ్ కాలనీ వాసులకు పట్టాలు పంపిణీ
- మంత్రి ఎంపీలకు ఘనంగా స్వాగతం పలికిన స్థానిక ప్రజలు







**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త** నెల్లూరు 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో షాదీ మంజిల్ నిర్మాణ పనులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం సాయంత్రం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తో కలిసి భూమి పూజ చేశారు. ఇందు కోసం కోటి రూపాయల చెక్కును నగర పాలక సంస్థ కమీషనర్ నందన్‌కి ఎంపీ, మంత్రి సంయుక్తంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారాయణ, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిలకు హారతులిచ్చి స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. షాదీ మంజిల్ నిర్మాణానికి సహకరించిన మంత్రికి, ఎంపీకి స్థానిక ముస్లిం సోదర సోదరీమణులు జేజేలు పలికారు. ప్రజా సేవలో తరిస్తున్న నేతలకు మంచి జరగాలని ముస్లిం పెద్దలు దువా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ సమావేశంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ నెల్లూరు 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీలో షాదీ మంజిల్ నిర్మాణ పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. 2014-2019లో ఎవరు అడగకుండానే నెల్లూరును రూ.5250 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. తద్వారా పురిటిగడ్డ రుణం కొంత మేర తీర్చుకున్నానని తెలిపారు. 2024 ఎన్నికల్లో మైనార్టీ సోదరులు తనకు ఎంతో అండగా నిలిచారని మంత్రి నారాయణ గుర్తు చేశారు. నెల్లూరు సిటీ ప్రజల సంయుక్త కృషితో చరిత్రలో నిలిచిపోయేలా 77 వేల కోట్ల మెజార్టీతో తనను గెలిపించారని సంతోషం వ్యక్తం చేశారు. తన కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని ప్రస్తుతం నిలబెట్టుకుంటున్నానని చెప్పారు. దాంతో 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డి కాలనీ వాసుల కల నెరవేరబోతుందన్నారు. జనార్ధన్‌రెడ్డి కాలనీలో గత ప్రభుత్వం ఆపేసిన షాదీ మంజిల్ పనులను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. 2019లో కోటి రూపాయల కార్పొరేసన్ నిధులతో షాదీ మంజిల్ పనులు ప్రారభించామని అయితే ఆ పనులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలిపివేసిందన్నారు. గత పాలకులు అభివృద్ధి పనుల విషయంలో శాడిజాన్ని చూపించారని మండిపడ్డారు. అప్పట్లో షాదీ మంజిల్ పూర్తయ్యేదని, అలా పూర్తి అయివుంటే ముస్లిం సోదరులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదన్నారు. పరిపాలన చేతకాక రాష్ట్రంలో వ్యవస్థలన్నింటిని గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని దుయ్యబట్టారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక అనుభవజ్ఞుడు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రంలో పాలన గాడిలో పడుతోందని అన్నారు. షాదీ మంజిల్ నిర్మాణానికి ఎంపీ అభ్యర్ధి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్ధిగా నేను ఎన్నికల్లో హామీ ఇచ్చామని, ఆ మేరకు ఛలో యాభై లక్షల రూపాయలు విరాళం ఇచ్చి కోటి రూపాయలతో పనులను ఈ రోజు పునఃప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు అదనంగా నిధులు అవసరం అయితే కార్పొరేషన్ ద్వారా కానీ వక్ఫ్‌బోర్డు ద్వారా కానీ సమకూరుస్తామని తెలియజేశారు. అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా అక్టోబర్ లోపు షాదీ మంజిల్ పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భగత్ సింగ్ కాలనీ వాసులు సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కరించారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఓట్ల కోసం దొంగపట్టాఉ ఇచ్చి మోసం చేసిందని ఎద్దేవ చేశారు. అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చామని , మేరకు సమస్యను క్యాబినెట్‌లో పెట్టి 1400 కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేలా ఆమోదముద్ర వేయించామని మంత్రి నారాయణ గర్వంగా చెప్పారు. త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాలు అందజేస్తామని తెలియజేశారు. నెల్లూరు సిటీలో ఐదు వేల మందికి ఇంటి పట్టాల సమస్య పరిష్కరిస్తామన్నారు. సిటీలోని ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి, 2 రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఆపేసిన అండర్ గ్రౌండ్ పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. ఆ పనులు కూడా ఏడాది లోపు పూర్తి చేస్తామన్నారు. ఒక్క రూపాయికే డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని దోమల రహిత నగరంగా నెల్లూరును తీర్చి దిద్దేందుకు సహకరించాలని మంత్రి కోరారు. అలాగే వీఆర్సీ హైస్కూల్‌ని రూ.15కోట్లతో ఆధునీకరిస్తున్నామని , తద్వారా నగరంలోని వెయ్యి మంది నిరుపేద విద్యార్థులకు ఈ ఏడాది అడ్మిషన్ కల్పిస్తామని సంతోషంగా చెప్పారు. కార్పొరేట్‌ని మించిన విద్యను పేద పిల్లలకు అందిస్తామన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు ట్రాన్స్ ఫోర్ట్ భోజనం, స్నాక్స్ ఉచితంగానే కల్పించబోతున్నట్లు వెల్లడించారు. వీఆర్సీ హైస్కూల్‌ను దేశంలోనే రోల్ మోడల్‌గా నిలబెడతామన్నారు. అదే విధంగా నెల్లూరు సిటీలో ముస్లిం సోదరులకు ఏ కష్టం వచ్చినా అండా నిలిచి ఆదుకుంటామని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సొంత నిధులతో షాదీ మంజిల్ నిర్మిస్తున్నామని తెలిపారు. నెల్లూరులో వేల కోట్ల అభివృద్ధి చేసిన ఘనత మంత్రి నారాయణదని కొనియాడారు. అభివృద్ధి కోసం పరితపించే మంత్రి నారాయణ ఉండటం మన అదృష్టమని అభినందించారు. వైఎస్సార్‌సీపీకి టీడీపీకి చాలా వ్యత్యాసం ఉందన్నారు. మహానాడులో టీడీపీ మంత్రులు, అధ్యక్షులు క్రమశిక్షణ చూశానని, అయితే మాజీ సీఎం జగన్ వద్ద ఇలాంటి సిస్టమ్ లేదని ఎంపీ వేమిరెడ్డి గత ప్రభుత్వ పాలనపై ఎద్దేవ చేశారు. తదనంతరం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసినా వైఎస్సార్‌సీపీ పనులు ఆపేసిందని, తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. నేతల విరాళంతో పాటు కార్పొరేషన్ నిధులు కలిపి రెండు కోట్లతో షాదీ మంజిల్ నిర్మాణం ప్రస్తుతం జరుగుతుండటం శుభ సూచికమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పొంగూరు నారాయణ లాంటి మంచి మనసున్న నేతల కలయిక అరుదైనదని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే అనిల్ చేయలేని పని ప్రస్తుత మంత్రి నారాయణ చేసి చూపించారన్నారు. భగత్ సింగ్ కాలనీలో 1400 మందికి శాశ్వత ఇంటి పట్టాలు మంజూరు చేయించారని తెలియజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఎంపీ, మంత్రికి ఎవరు సాటిలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ తహసీన్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, నగర మైనార్టీ కమిటీ అధ్యక్షులు ఇక్బాల్, స్థానిక కార్పొరేటర్ షఫియా బేగం, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జహీర్, కోఆప్షన్ సభ్యులు జమీర్, టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే మా ప్రభుత్వ లక్ష్యం

- నెల్లూరులో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడి
- మైపాడు సెంటర్లో 200 షాపులు
- బ్యాంకుల ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేయిస్తాం
- సొంత నిధుల ద్వారా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తా
- ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా చూడాన్నదే నా లక్ష్యం
- మంత్రి నారాయణ ప్రకటనతో కృతజ్ఞతలు తెలిపిన మెప్మా మహిళలు





**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త-వైద్యం** మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. తన క్యాంపు కార్యాలయంలో మెప్మా మహిళలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్మార్ట్ సిటీగా ఉన్న నెల్లూరులోని మైపాడు సెంటర్లో 200 షాపులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బ్యాంకు ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేయిస్తామన్నారు. అయితే ప్రతి మహిళకు తన వంతు కూడా ఒక లక్ష రూపాయలు సాయం చేస్తానని మంత్రి నారాయణ ప్రకటించారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ఈ షాపులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామికవేత్తగా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన వెల్లడించారు. 20 రోజుల్లో స్మార్ట్ సిటీని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. తమ వ్యాపార అభివృద్ధికి రెండు కోట్ల సొంత నిధులు ప్రకటించిన మంత్రికి మెప్మా మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. మెప్మా పీడీ లీలారాణి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో చదువే కీలకం





**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే చదువే ప్రధాన ఆయుధమని, దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డలను పనుల్లో పెట్టుకోకుండా చక్కగా చదివించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని బుద్ధి పద్మావతి కళ్యాణ మండపంలో ఆదివారం కోవూరు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోఇటీవల పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన దేవాంగ వంశీయుల చిన్నారులకు నగదు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆెు మాట్లాడుతూ దేవాంగ సంక్షేమ సంఘం ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిలో పోటీతత్వాన్ని చేసేందుకు ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా బాలికలు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారని, ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు కూడా వారికి బాల్య వివాహాలు చేయకుండా వివాహ వయస్సు వచ్చిన తర్వాతనే వారికి వివాహం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలలోనే విద్యార్థులకు తల్లికి వందనం కార్యక్రమం కింద తల్లి ఖాతాలో నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా వాటిని పట్టించుకోకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. సోషల్ మీడియా మొబైల్ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వయస్సులో సెల్‌ఫోన్ జోలికి వెళ్తే అత్యంత ప్రమాదకరమని సూచించారు గత ప్రభుత్వంలో విద్యాశాఖను పూర్తిగా నాశనం చేశారన్నారు. ప్రస్తుతం యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యాశాఖలో నూతన సంస్కరణలకు తెర తీశారన్నారు. గత ప్రభుత్వం లాగా కాకుండా నాణ్యమైన విద్యా కిట్లను పంపిణీ చేసేలా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పాఠశాల తెరిచే నాటికే విద్యా కిట్లు విద్యార్థులకు అందించేలా ప్రణాళికలు కూడా రూపొందించడం జరిగిందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన దేవాంగ సంక్షేమ సంఘం నేతలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిచ్చుక మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, పలు సూచనలు చేశారు. అనంతరం పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చిన 16 మంది విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన 17 మంది విద్యార్థులకు, ఇంటర్ 2వ సంవత్సరంలో 6 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను, షీల్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, గ్రామ సర్పంచ్ వై. విజయ, మండల విద్యాశాఖ అధికారి రహీమ్, వై. చెంచులక్ష్మమ్మ, నేతలు గాదిరాజు అశోక్‌కుమార్, అత్తిపల్లి శివారెడ్డి, నల్లపరెడ్డి సురేష్‌రెడ్డి, , కూటమి నేతలు సుబ్బారావు, చక్రవర్తి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మున్వర్‌బాషా, అల్తాఫ్, తదితరులు ఉన్నారు.

# నాణ్యమైన నిత్యావసర వస్తువులు రేషన్‌షాపుల ద్వారా పంపిణి




**కావలి, జూన్ 1 ప్రభాతవార్త** నాణ్యమైన నిత్యావసర వస్తువులు రేషన్‌షాపుల ద్వారా ఇవ్వాలనే లక్ష్యంతోనే రేషన్‌షాపులను పునఃప్రారంభించినట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి వైకుంఠపురంలోని 29వ రేషన్‌షాపు వద్ద లబ్దిదారులకు ఆదివారం నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే దగుమాటి పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పక్కదారి పట్టాయని తెలియచేశారు. లబ్దిదారుల వద్ద సమయానికి నగదు లేకపోతే సరుకులు తీసుకోవడం ఇబ్బందిగా ఉండేదని పనులు మానుకుని సరుకులు తీసుకునే పరిస్థితి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం 15 రోజులపాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కూడా రేషన్ షాపులు తెరిచే ఉంటాయని తెలియచేశారు. 65 సంవత్సరాలు పైబడినవారికి, దివ్యాంగులకు ఇంటివద్దకే డీలర్లు సరుకులు అందించడం జరుగుతుందని తెలియచేశారు. ప్రతి రేషన్‌షాపు వద్ద బోర్డులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రభుత్వం ఏమి సరుకులు మంజూరు చేసిందో ఆ బోర్డులో తెలియచేయడం జరుగుతుందన్నారు. రేషన్‌షాపుల ద్వారా చిరుధాన్యాలను కూడా పంపిణి చేయనున్నట్లు తెలియచేశారు. ఆరోగ్యకరంగా ఉండాలంటే చిరుధాన్యాలు అవసరమని తెలియచేశారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం ప్రజాశ్రేయస్సు కోసం, ప్రజల అభ్యున్నతికోసం పేద, బడుగు, బలహీనవర్గాలకోసం ఆరోగ్యవంతమైన సమాజంకోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్డు ఉన్నటువంటి వ్యక్తులు ప్రత్యక్షంగా కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు వచ్చి రేషన్‌షాపు నుండి సరుకులు తీసుకువెళ్లాలని తెలియచేశారు. ఇది మంచి ప్రభుత్వమని ఈ ప్రభుత్వం ఎప్పుడూ కూడా ప్రజలపక్షాన నిలబడే ప్రభుత్వమని, ప్రజలకోసం ఆలోచించే ప్రభుత్వమని, ఈ మంచి ప్రభుత్వాన్ని మనందరం ఆశీర్వదించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రావణ్‌కుమార్, సియస్‌డిటి విజయమ్మ, కావలి పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, స్థానిక నాయకులు మంచాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ నెల్లూరు మన లక్ష్యం

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడి - మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి



**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త -వైద్యం** స్వచ్ఛ నెల్లూరు లక్ష్యంగా పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. 54వ డివిజన్‌లోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో త్రీడి మీటర్ స్లీపింగ్ మిషన్లను ఆయన ప్రారంభించారు. కోటి 30 లక్షల రూపాయల విలువైన మిషన్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం వాటి పనితీరును మంత్రి నారాయణ స్వయంగా పరిశీలించి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కి వాటిని అప్పగించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. స్వచ్ఛ ఆంధ్రకి ఏపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, అందుకు అనుగుణంగా ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. రేషన్ పంపిణీలో మార్పు తీసుకొచ్చిందని మంత్రి అన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని, ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 42ఏళ్ల క్రితం ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం పథకం ప్రారంభమైనప్పటి నుంచి రేషన్ షాపులు అలాగే పని చేసేవి.. ఈ పక్రియను వైసీపీ ప్రభుత్వం మార్చి గందరగోళానికి తెరలేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి

- శరవేగంగా అమరావతి రాజధాని నిర్మాణ పనులు
- 2027 నాటికి పోలంవరం పూర్తి చేసేందుకు కృషి
- రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పోలవరంబనకచర్ల ప్రాజెక్ట్
- అర్హులైన పాత్రికేయులందరికీ త్వరలోనే అక్రిడిటేషన్లు
- రాష్ట్ర గృహనిర్మాణ, ఐ అండ్ పిఆర్ మంత్రి కొలుసు పార్థసారథి



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 1, ప్రభాతవార్త** విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.

❖ ఆదివారం యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి నెల్లూరుకు విచ్చేసిన మంత్రి పార్థసారధి పాత్రికేయులతో మాట్లాడారు. అన్నిరకాలుగా విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తూ సరికొత్త విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని, విజన్ 2047 ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచంలో ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత అందరూ 2047 విజన్ లక్ష్యాలను అందుకునేందుకు భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 7లక్షల కోట్లతో పెట్టుబడులు వచ్చాయని, పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో సుమారు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యంగా ఎన్డీఎ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి చెప్పారు. టెక్నాలజీపరంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న సీఎం, ఐటి, సాఫ్ట్‌వేర్ కంటే కూడా మెరుగైన ఫలితాలు అందిస్తున్న క్వాంటమ్‌వ్యాలీ టెక్నాలజీని కూడా దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ అడ్వాన్స్ టెక్నాలజీతో లక్షలాదిగా ఉద్యోగాలు వస్తాయని, ఆధునిక టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయని, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నుంచి 2027 డిసెంబరులోగా పూర్తిచేసేలా పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించారని, 80వేల కోట్లతో పోలవరంబనకచర్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరుజిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు జాతీయరహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎక్కడా లేనివిధంగా సమాజంలో పేదల అభివృద్ధికి సీఎం చంద్రబాబు చేపట్టిన పి 4 కార్యక్రమం ఒక విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలుకుతుందని మంత్రి చెప్పారు. సంపన్నవర్గాల వారు అట్టడుగున్న వున్న నిరుపేదలకు చేయూతనిచ్చి ఆ కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేసే గొప్ప కార్యక్రమం పి 4 అని మంత్రి చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర జిడిపి కూడా బాగా పెరిగి అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని మంత్రి ఆకాంక్షించారు. ప్రతిపక్షాలు కూడా తాము చేసిన తప్పులను సరిదిద్దుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

❖ త్వరలోనే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తామని మంత్రి పార్థసారధి చెప్పారు. 2014లో సీఎం చంద్రబాబు హయంలో 21వేల అక్రిడిటేషన్ కార్డులు అందిస్తే, గత ప్రభుత్వం కేవలం 12 వేలు మాత్రమే ఇచ్చిందని మంత్రి చెప్పారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని, పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాత ఈ క్యాబినేట్‌లో గానీ, వచ్చే క్యాబినేట్‌లోని చర్చించి వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై భర్త హత్యాయత్నం

**నెల్లూరు క్రైమ్, జూన్ 1, ప్రభాతవార్త :** భార్యపై అనుమానం పెంచుకున్న ఓ దుర్మార్గుడు చివరకు ఆమెను కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాలాజీ నగర్ పోలీసుల కథనం మేరకు శ్రామిక్ నగర్‌కు చెందిన బండ్ల రమ, శ్రీనాథ్ దంపతులకు 2017లో వివాహమైంది. శ్రీనాథ్ ఆటో నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. రమ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్మూర్తి నగర్‌లో బ్యూటీ సెలూన్‌లో పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న శ్రీనాథ్ తరచు ఆమెతో గొడవ దిగుతుండేవాడు. దీనికి కొంత కాలం కిందట ఆమె నాలుగు దూరంగా జరిగి తమ ఇద్దరు పిల్లలతో జీవిస్తూ వచ్చింది . ఇటీవల పెద్దలు వారిద్దరికీ రాజీ కుదరచ్చడంతో తిరిగి భర్తతో కలిసి కాపురం చేస్తోంది. అయినప్పటికీ ఆమెపై ఉన్న అనుమానంతో రగిలిపోతున్న శ్రీనాథ్ ఆదివారం పనిచేసే సెలూన్ వద్దకు వచ్చిన రమ్య లోపలికి వెళ్లబోతుండగా ఆమెపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో శ్రీనాథ్ పరారయ్యాడు. సంఘటన విషయం తెలుసుకున్న బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు సంఘటన స్థలాన్ని చేరుకుని తీవ్ర గాయాలు పాలైన రమ్యను ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**నెల్లూరు రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :** నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డులోని హెచ్‌ఆర్ కళ్యాణమండపం నందు ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి ఇంటర్ దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. డాక్టర్ మన్నెం సతీష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సులూరుపేట, వెంకటగిరి, గూడూరు, కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు తదితర నియోజకవర్గాలకు చెందిన 115 మంది దేవాంగ విద్యార్థిని విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, ప్రశంసా పత్రము, జ్ఞాపిక, నగదు బహుమతి, విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు వివిధ ప్రాంతాల నుండి దేవాంగ ప్రముఖులు హాజరయ్యారు. నెల్లూరు ప్రాంతానికి చెంది, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన దేవాంగ ప్రముఖులు హాజరు కావడం ముఖ్య విశేషం. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక లేదా ఆర్థికపరమైన వెనుకబాటుతనాన్ని ప్రతిభతో అధిగమించగలమని, ఆత్మవిశ్వాసం పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోగలమని అన్నారు. దేవాంగ సంఘం ఇటువంటి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికంగా వెనుకబడిన పిల్లల మనోబలాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నామని, ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయ సంకల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకట సురేష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండ మాధవయ్య, హాజరతయ్య, జక్కల సురేష్,,వార్త రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిలుగా సీనియర్ సిపిఐ నాయకులు పముజుల దశరథ రామయ్య, కన్నా రాఘవరావు, డాక్టర్ సజ్జ సతీష్ కుమార్, మన్నెం రవీంద్రనాథ్ ఠాగూర్ గౌరబత్తినశివయ్య, సజ్జ నవోదయ, మన్నెముద్దు శ్రీనివాసులు, గుత్తి త్యాగరాజు, కర్ణ చంద్రశేఖర్ పముజుల నాగేశ్వరరావు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన రేషన్ షాపులు ప్రారంభం సర్పంచ్ లక్ష్మిబాయి



**కొడవలూరు, జూన్ 1, ప్రభాతవార్త :** మండలం పాత వంగల్లు పంచాయతీ పరిధిలో గతంలో తెలుగుదేశం పార్టీ రేషన్ దుకాణాల వద్ద ప్రజలకు సరుకులు అందించే విధానాన్ని మరలా పునప్రారంభం చేయడం సంతోషకరమైన విషయమని పాత వంగల్లు సర్పంచ్ లక్ష్మిబాయి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు రేషన్ సరుకులు అందజేయాలని రేషన్ కార్డ్ డీలర్లకే కేటాయించడం ఎంతో ఉపయోగకరమని ఇది ప్రతి ఒక్క రేషన్ కార్డ్ దారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సారధ్యంలో, మండల ఇంచార్జ్ మంగమూరు శ్రీహరి రెడ్డి ఆదేశాలతో రేషన్ కార్డుదారులందరకు డీలర్లచే రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ షాపులు ప్రారంభం



**కొడవలూరు, జూన్ 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులు పునప్రారంభానికి శ్రీకారం చుట్టడం జరిగిందని దీనివలన ప్రజలందరికీ ప్రభుత్వం నుండి వచ్చే రేషన్ సరుకులు తప్పనిసరిగా అందజేయడం జరుగుతుందని తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఉన్న రేషన్ షాప్ డీలర్లు మండల ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండి రేషన్‌సరుకులు అందజేయాలని సూచించినట్లు ఆమెతెలి పారు. గతంలో రేషన్ షాపులవద్ద సరుకులు పంపిణీ విధానాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలియజేశారు.

## లింగసముద్రంలో క్రూరంగా వ్యక్తి దారుణ హత్య

- ముక్కలు చేసి బోర్ బావిలో వేసిన హంతకుడు
- సంచలనం రేపిన నరసింహ హత్య - పోలీసుల అదుపులో నిందుతుడు







**లింగసముద్రం, కందుకూరు, జూన్ 1, ప్రభాతవార్త :** అత్యంత క్రూరంగా ఓ వ్యక్తిని దారుణ హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసి లింగసముద్రంలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీ పరిధిలోని జంపాలవారిపాలెం గ్రామానికి చెందిన తోపూరి నరసింహం(60) ఈనెల 30న ఉదయం 10గంటలకు ఆర్‌ఆర్‌పాలెం పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం సమీపంలో ఉన్న తన నిమ్మ తోటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంత సేపు అయినా మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి వచ్చింది. దీంతో ఆయన కుమారుడు తోటలోకి వెళ్లి చూడగా తోటలో టీఈఎస్ ఎక్సెల్ మాత్రమే ఉంది. తోట మొత్తం వెతికిన నరసింహం కనిపించలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువులను విచారించారు. ఎక్కడ కూడా ఆచూకీ కనిపించలేదు. దీంతో నిమ్మ తోటలో పనులు ఉన్నప్పుడు గత కొన్ని సంవత్సరాలు నుండి చలంచర్ల బ్రహ్మయ్య అనే కూలిని పెట్టి పనులు చేస్తూ ఉండేవాడు. అతని మీద అనుమానం రావడంతో అతన్ని గట్టిగా అడగడం జరిగింది. దీంతో పొంతనలేని సమాధానాలు చెప్పడం వల్ల అతని ఏదో చేశాడని శనివారం పోలీసు స్టేషన్‌లో కుమారుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నరసింహంను తానే హత్య చేశానని, బ్రహ్మయ్య పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు తెలిసింది. గట్టిగా విచారించడంతో తానే ముక్కలు చేసి బోరుబావిలో వేశానని చెప్పినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని కందుకూరు డీఎస్పీ సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు పరిశీలించారు. ఘటన జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరించారు.

**డాగ్ స్క్వాడ్ పరిశీలన :**

సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఘటన స్థలానికి పోలీసు జాగిలం వచ్చి బోరుబావి పరిసరాల చుట్టు కలియ జరిగింది. అత్యంత అమానుషంగా వ్యక్తిని ముక్కలు చేసి బోరుబావిలో వేశారని విషయం తెలియడంతో ఒక్క సారిగా పరిసర ప్రాంత ప్రజలకు ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు నిమ్మతోట వద్దకు చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు, బ్రహ్మయ్య నుండి ఇంకా పూర్తి సమాచారం రావాల్సి ఉందని ఎస్సై నారాయణ చెప్పారు.

## నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రాక



**కొడవలూరు, జూన్ 1, ప్రభాతవార్త :** మండలంలోని నార్త్ రాజుపాలెం జాతీయ రహదారి పరిధిలో ఉన్న జీవనజ్యోతి కళాశాలను పర్యవేక్షించడానికి ముఖ్య అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రానున్నట్లు జీవనజ్యోతి చైర్మన్ వై. అమర్నాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆహ్వానితులు.

## ఉదయం, సాయింత్రం రెండు పూటల రేషన్ సరుకులు



**మనుబోలు జూన్ 1 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాల్లో బాగంగా రేషన్ షాపుల వద్దనే రేషన్ సరుకుల పంపీణి కార్యక్రమాన్ని ఆదివారం నుండి ప్రారంభించారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉదయం 8 గంటల నుండి మద్యహ్నం 12 గంటల వరకు, సాయింత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు మీకు అందుబాటులోని ఏ రేషన్‌షాపులో నైనా సరుకులు అందించడం జరుగుతుందని ఆదివారాల్లో సైతం సరుకులు పంపీణి జరుగుతుందని రెవిన్యూ అధికారులు తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క లబ్దిదారుడు రేషన్‌షాపుకు వెళ్ళి సరుకులు తీసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మనుబోలు జడ్‌పిటిసి చిట్టుమూరు అనితమ్మ, విఆర్‌ఒ శ్రీనివాసులు, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రావుల అంకయ్యగౌడ్, శివుడు రాజాగౌడ్ జితేంద్ర, గౌడ్ రాయపాటి కిరణ్‌కుమార్, చల్లగిరి ప్రసాద్, కలికి రమేష్‌రెడ్డి, డీలర్లు ఉచ్చూరు శ్రీలక్ష్మీ, కోసూరు సుశీలమ్మ, శివుడు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## లుంబిని విద్యార్దినికి ప్రతిభా పురస్కారం



**చేజర్ల జూన్ 1 ప్రభాతవార్త :** చేజర్లలలోని లుంబిని ప్రవేటు పాఠశాల విద్యార్దినికి అరుదైన పురస్కారం లభించింది. యాదవ్ ఎంప్లాయ్, ప్రొపెషనల్ అసోసియేషన్ ఆదివారం నెల్లూరులో ఏర్పాటు చేసినప్రతిభా పురస్కార కార్యక్రమంలో భాగంగా లుంబిని విద్యాలయం విద్యార్దిని ఇటీవల విడుదలైన పదోవ తరగతి ఫలితాలలో ఉడత అనూషాకి 594 మార్కులు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారది చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం, అవార్డు బహుమతులు అందుకుంది ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ బి .రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన పెంచుకోవాలి



**కావలిరూరల్, జూన్1 ప్రభాతవార్త :** పురపాలక సంఘాల, మండలాల పరిధిలో 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ గేజ్‌ఉన్న ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు చేసినా, వినియోగించినా అపరాధ రుసుము ఉంటుందని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటి సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు నిషేధచట్టంపై ప్రజలు అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ కవర్లను నిషేధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, దీనిని పౌరసంఘాలు, పురపాలకశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషిచేయాలని కోరారు. మనం నివసించే నేల, పీల్చేగాలి, తాగేనీరు, మనచుట్టూ ఉండే మొక్కలు, జంతుజాలం వెరసి మనం పర్యావరణం అంటామన్నారు. పర్యావరణం పరిరక్షించుకోవడం కోసం ప్లాస్టిక్ వినియోగించడం వలన కలిగే దుష్ఫలితాలు, క్యాన్సర్‌వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యవిజ్ఞానం తెలుపుతుందని తెలిపారు. అందువల్ల ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి గుడ్డసంచులు, దోనెలు, ఇస్తరాకులు లాంటివి శుభకార్యాలలో, నిత్యజీవితంలో ఉపయోగించుకుని పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరారు

## రేషన్ పంపిణీని ప్రారంభించిన తహసిల్‌దార్ ప్రమీల



**జలదంకి, జూన్ 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వాహనాల స్థానే తిరిగి రేషన్ షాపులద్వార నిత్యావసర సరకుల పంపిణీకి శ్రీకారంచుట్టిన నేపద్యంలో ఆదివారం జలదంకి మండలంలోని రేసన్ దుకాణాలు తెరుచుకున్నాయి. మండల తహసిల్‌దార్ ప్రమీల జలదంకిలోని పలుదుకాణాలను ప్రారంభించి అందరి హర్షద్వానాలమద్య లబ్దిదారులకు సరకులు అందజేశారు. ఉదయంనుంచే డీలర్లు దుకాణాలను తెరచి పంపిణీకి సిద్దంచేయగ తహసి ల్‌దార్ ప్రమీల తన చేతులమీదుగ రేషన్‌ను అందించారు. ముందుగ స్థానికంగ వున్న 32వషాపు, 24,25,దుకా ణాల ం,అనంతరం నెహ్రూనగర్ గిరిజనకాలని33వ షాపు, గోపన్నపాళెం 10వ నంబర్ షాపులను తహసిల్‌దార్ ప్రారంభించారు. ఈసందర్బంగ ఆమె మాట్లాడుతు ప్రతి నెలా 15వ తేది వరకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా సరకులు పంపిణి వుంటుందని తెలిపారు. వృద్దులు, దివ్యాంగులకు డోర్ డెలివరి వుంటుందని వివరించారు. ఉదయం 8గంటలనుంచి మద్యాహ్నం 12గంటల వరకు, తిరిగి సాయంత్రం 4గంటలనుంచిరాత్రి 8గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని కావున కార్డు హోల్డర్స్ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టంచేశారు. కాగా మండలంలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ఈనూతన పాలసీలో పాల్గొన్నారు. జలదంకిలో మండల టిడిపి కన్వీనర్ పులిగుంట మధుమోహన రెడ్డి ఆద్వర్యంలో ఆపార్టీ శ్రేణులు మారుబోయిన నారాయణ, భీమవరపు తిరుపతయ్య, ఒంగోలు మదన్, ఒంగోలు మాల్యాద్రి, ఏగూరి రఘు, గోసు రాములు తదితరులతోపాటు గోపన్నపాలెంలోఆపార్టి నేత మాదిరెడ్డి సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణక్రాకలో సీనియర్ నాయకుడు వంటేరు జయచంద్రారెడ్డి ,రోసిరెడ్డి, కమ్మవారిపాళెంలో పెంచల్‌నాయుడు, చామదలలో యువత అద్యక్షుడు మునగాల తిరుమల రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొని సరకులు పంపిణి చేశారు. మండలంలోని అన్ని పంచాయతీలలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ప్రమాద భీమా సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులు పంపీణి



**మనుబోలు జూన్ 1 ప్రభాతవార్త :** జనసేన అద్యక్షులు మరియు డిప్యూటి సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన ప్రమాదభీమా సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులను టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌గారి సూచనలతో మనుబోలు మండలం అద్యక్షులు పెనుబాక ప్రసాద్ ఆద్వర్యంలో మనుబోలు గ్రామ సభ్యులకు క్రియాశీల సభ్యత్వ గుర్తింపు కార్డులను మరియు ప్రశంసా పత్రాలను ఆదివారం నాడు అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా సభ్యత్వ నమోదు చేసుకున్నవారు ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని అన్నారు. ఈకార్యక్రమంలో మనుబోలు మండల జనసేన నాయకులు నీటి సంఘం టిసి మెంబర్ పెనుబాక మహేష్, జాకీర్ ఖాదర్ వల్లీ, శ్రీను, కోటేశ్వర్‌రెడ్డి, కిరణ్ ఉదయ్ శ్రీకాంత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ



**రాపూరు, జూన్1ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు ఇకపై ప్రతి నెల రేషన్ దుకాణాల వద్దనే రేషన్ సరకుల పంపిణీ జరుగుతుందని రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన జోరేపల్లి గ్రామంలో రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు ప్రారంబించారు. గతంలో వాహనాల ద్వారా ఇళ్లవద్దనే రేషన్ పంపిణీలో అనేక సమస్యలు వుండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేషన్ దుకాణాలు ఇకపై ప్రతి నెలా 1వ తారీఖు నుండి 15వ తారీఖు వరకు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో పాటు వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ళ వద్దనే సరకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి పేరయ్య, పలువరు టిడిపి నేతలు తదితరులు వున్నారు.

## కండలేరులో 40.370 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్1ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో ఆదివారం ఉదయం నాటికి జళాశయంలో 40.370 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2400 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2480 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా 15 రోజుల పాటు రేషన్ పంపిణీ



**రాపూరు, జూన్1ప్రభాతవార్త :** రాష్టంలోని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇకపై ప్రతి నెలా 1వ తేది నుండి 15వ తేది వరకు రేషన్ సరకుల పంపిణీ చౌకదుకాణాల ద్వారా జరుగుతుందని రాపూరు మండల టిడిపి యువ నాయకుడు చెన్ను అశోక్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి సూచనలతో ఆదివారం తానంచర్ల, పోకూరుపల్లి గ్రామ చౌకదుకాణాల వద్ద ఆయన రేషన్ దుకాణాల వద్దే రేషన్ పంపిణీని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వాహనాల ద్వారా రేషన్ ఇళ్ళ వద్దే రెండు రోజుల పాటు ఇవ్వడంతో పనులకు వేల్లే వారు అనేక ఇబ్బందులు పడుతూ రేషన్ కోసం పనులు మానుకోవాల్సి వచ్చేదన్నారు. సమస్యను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇకపై అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా 1వ తేది నుండి 15వ తేది వరకు ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు, మద్యాహ్నం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ జరిగేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. వయస్సు 60 దాటిన వారికి మంచంలో వున్న వారికి మాత్రం రేషన్ డీలర్ ద్వారానే ఇళ్ళ వద్ద సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈయన వెంట నాయకులు రాపూరు సొసైటీ మాజీ చైర్మన్ చెన్ను బాస్కర రెడ్డి, దేసు బాస్కర రెడ్డి, నల్లవడ్ల రమణా రెడ్డి తదితరులున్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ చేయాలి

**తూమాయి(రాపూరు), జూన్1ప్రభాతవార్త :** మండలంలోని తూమాయి గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ సరకులు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తూమాయి గ్రామ సర్పంచ్ పైడిపూల చంద్రమోహన్ రాపూరు మండల తహశిల్దార్‌ను కోరారు. ఆదివారం సర్పంచ్ మోహన్ మాట్లాడుతూ తూమాయి గ్రామానికి సంబందించిన రేషన్ దుకాణం ప్రధాన గ్రామానికి 1.5 కి.మీ దూరంలో వుందన్నారు. దీంతో పాటు తూమాయికి అంతర్ గ్రామంగా వున్న రేగడపల్లి ఆరుందతీయ వాడ వుందన్నారు. వీరికి సంబందించిన రేషన్ దుకాణం ఆర్.ఆర్ సెంటర్‌లోవుందన్నారు. దీంతో రేషన్ తీసుకోవాలంటే ప్రజలు సుమారు 4 కిలోమీటర్లు వచ్చి సరకులు తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇందువల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురైతారని తెలిపారు. అందువల్ల ఈ రేషన్ పంపిణీని ఆర్.ఆర్ సెంటర్‌లో 7 రోజులు, ప్రధాన గ్రామంలో 7 రోజులు వుండేలా చర్యలు తీసుకోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## అధికారులకు అర్జీ ఇచ్చే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా



**నెల్లూరు రూరల్, జూన్ 1, ప్రభాతవార్త :** అధికారులకు అర్జీ ఇచ్చే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా అని కాకాణి పూజిత ప్రశ్నించారు. ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్‌ను శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు నగర సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం వెన్నుపోటుతోనే మొదలైంది. సొంత మామని వెన్నుపోటు పొడిచి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. ఆనాడు రామారావుకి వెన్నుపోటు తర్వాత రామారావు ముఖ్యమంత్రి అవ్వడానికి ప్రధాన కారణమైన రెండు రూపాయల కిలో బియ్యం, మద్యపాన నిషేధం రెండు పథకాలకి కూడా వెన్నుపోటు పొడవడం జరిగింది. ఆ వెన్నుపోటు విధానాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత, ఒకసారి ప్రతిపక్షానికి పరిమితమైతే కనీసం ఇప్పటికైనా మారి ఉంటారని ఆయన ఇచ్చిన హామీలను నెరవేస్తారని నమ్మి ఆయనకు అధికారం కట్ట పెడితే ఇప్పటికీ అయిన మారలేదు. ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా సుమారు 12 లక్షల మంది విద్యార్థులను వెన్నుపోటు పొడిచారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన వ్యక్తి ఉద్యోగాలు ఇవ్వకపోగా వాలంటీర్స్, రేషన్ పంపిణీ వాహనాలు, మద్యం షాపుల్లో పనిచేసే వ్యక్తులు ఇలా సుమారు 3 లక్షల మంది ఉద్యోగాలను తీసివేశారు.

అదేవిధంగా రాష్ట్రంలో సుమారు 60 మంది వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తుంటారు. వారికి రైతు భరోసా వైఎస్ఆర్సిపి 13500 ఇస్తుంటే నేను 20,000 ఇస్తానని నమ్మించి ఇప్పటికీ ఒకరికి కూడా ఇవ్వలేదు. సుమారు 53 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారిని కూడా వెన్నుపోటు పొడిచారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 1500 ఇస్తానన్నారు. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలు సుమారు కోటి మంది ఉంటే ఒకరి కూడా ఇంతవరకు ఇవ్వలేదు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని చెప్పి ఇప్పటికీ అదిగో ఇదిగోని మాట మారుస్తున్నారు. ఇటువంటి హామీలను అమలు చేయమని గొంతు ఎత్తితే వారిని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపించి భయపెట్టాలని చూస్తున్నారు. ఈ రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచక విధానాల్ని రాష్ట్రంలోనే కాక దేశంలోనే చూసి విస్తుపోతున్నారు. వైఎస్ఆర్సిపి నాయకులను అనగదొక్కటే ప్రభుత్వ విధానాలను ఎవరు ప్రశ్నించరని, ప్రజలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం చేయరని ఓటమి నాయకులు అనుకుంటున్నారు. కానీ బంతి ఎంత గట్టిగా కింద కొడితే అంత ఎత్తుకు ఎదుగుతుందని మర్చిపోతున్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కూడా ఎంత అనగదొక్కాలను చూసినా అంత పైకి ఎదుగుతుంది. ఈ రోజు రాష్ట్రంలో అధికార పార్టీ చేయలేని కార్యక్రమాలను కూడా వైఎస్ఆర్సిపి చేస్తుంది అంటే ప్రజలలో మా మీద ఉన్న అభిమానం ఎలాంటిదో తెలుసుకోవచ్చు. వైఎస్ఆర్సిపి నాయకులుగా మేము ప్రజల్లోకి తలెత్తుకుని వెలగలుగుతున్నామన్నారు. అంటే అది మా నాయకుడు చేసిన పరిపాలన. అదే ఈరోజు తెలుగుదేశం నాయకులు ప్రజలకు వచ్చి తలెత్తుకోలేని పరిస్థితి. మేము తెలుగుదేశం పార్టీ అని గర్వంగా చెప్పుకోలేని పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితులలో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి సంవత్సరం రోజులు పూర్తి అవుతున్న సమయంలో ఈనెల నాలుగో తేదీన వెన్నుపోటు దినంగా ప్రకటించి ప్రజలతో కలిసి ఉద్యమబాట పట్టబోతున్నాం.

కనీసం ప్రజలతో కలిసి నిరసన తెలిపితే అయినా ఈ ప్రభుత్వంలో చలనం వచ్చి కొన్ని పథకాలు అయినా అమలు చేస్తుందని ఆ విధంగా ఆయన ప్రజలకు ఉపయోగపడతామని జగన్మోహన్ రెడ్డి ఆలోచన. అందువల్ల ప్రజలందరూ ఈ ఆందోళన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వం మెడలు వంచేలా సహకరించాలని కోరుతున్నాము. పేద ప్రజలకు, వృద్ధులకు, మహిళలకు, విద్యార్థులకు అందరికీ అండగా ఉండటంలో వైఎస్ఆర్సిపి ఎప్పుడు ముందు వరుసలో ఉంటుంది. పార్టీలో వెన్నుపోట్లు పొడవడం చూశాం కానీ నేడు గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడవడం ఈ ప్రభుత్వంలోనే ప్రజలు చూస్తున్నారని అన్నారు. ప్రజలకి జరిగిన అన్యాయాన్ని మోసాన్ని తెలియజేయడానికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేస్తున్నారన్నారు. ప్రజల కోసం మా నాన్న గోవర్ధన్ రెడ్డి ఎన్నో పోరాటాలు, నిరసనలు చేశారు. నాన్నపై అభిమానంతో నాతో కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నాయకులపై కేసులు పెట్టారు. మాకు అండగా ఎవరు నిలబడకూడదు అన్నట్టు మాకోసం నిలబడే ప్రతి ఒక్కరిపై కేసులు పెడుతున్నారు. నాన్నపై అభిమానంతో మీ తోటి దేనికైనా, ఎందాకైనా అని ప్రతి ఒక్కరు మాకు భరోసా ఇస్తున్నారు. ఎంత మందిపై కేసులు పెడుతారు. ప్రజాస్వామ్యంలో జిల్లా కలెక్టర్‌కి అర్జీ ఇచ్చే స్వేచ్ఛ కూడా ప్రజలకు లేదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని జైలులో పెట్టడానికి ఉన్న ఆసక్తి, ప్రజలకు మంచి చెయ్యడంలో చూపించండి. అధికారులు ఇలాంటి కక్షపూరిత చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నాన్న లేకపోయినా, ఉన్నట్లే భావించి విజయవంతం చేద్దామన్నారు. నాన్న నిత్యం ప్రజల కోసం పనిచేశారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం నుండి కూడా భారీగా ప్రజలు పాల్గొని, విజయవంతం చేద్దామన్నారు. అందరం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కాకాణి పూజిత పిలుపునిచ్చారు.

## ప్రమాదంలో తీవ్ర గాయాలైన స్వచ్ఛంద సంస్థ డైరక్టర్ వెంకట రమణయ్యకు ఎమ్మెల్యే అండ



**ఉదయగిరి, జూన్ 1, ప్రభాతవార్త :** గత నెల 29వ తేదీన కడప గడపలో జరిగిన మహానాడుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురైన ఉదయగిరి నివాసి టీడీపీ క్రియాశీలక సభ్యుడు, స్వచ్ఛంద సంస్థ డైరక్టర్ వెంకట రమణయ్యకు, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అండదండలు అందిస్తున్నారు. మొదట కడపలో వైద్యం చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని కిమ్స్ లో చేర్చారు. అక్కడ మెరుగైన వైద్యం అందుకున్న, స్వచ్ఛంద సంస్థ డైరక్టర్ వెంకట రమణయ్య, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక నాయకుల చేత సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తిరుపతి ఎమ్మెల్యే పులివర్తి నానితో మాట్లాడి టీడీపీ కుటుంబ సభ్యులకి అండదండలు అందించాలని కోరారు. ఆయన సహాయంతో కిమ్స్ లో రమణయ్యకు మెరుగైన వైద్యం అందుతుంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయగిరి వెంకటయ్య, ఐటీడీపీ ఉదయగిరి అధ్యక్షులు రామ్మోహన్ యాదవ్, రోశయ్య తదితరులు తిరుపతిలోని కిమ్స్ లో స్వచ్ఛంద సంస్థ డైరక్టర్ వెంకట రమణయ్యను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాకు బిక్ష పెట్టారని, ఆయన చొరువతోనే పునర్జన్మను పొందాను అన్నారు.

## పసుపు పంట రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



**ఉదయగిరి, జూన్ 1, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని బండగానిపల్లె పంచాయతీలోని పసుపు పంట వేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య ఆదివారం పసుపు కల్లాలులో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండనక వాననక పొలాలలో పని చేసి ప్రైవేటు వడ్డీలకు అప్పులు చేసి సంవత్సరాల కాలం పండించిన పసుపు పంటకు గిట్టుబాటు ధర మద్దతు రేటు లేక అల్లాడుతున్నటువంటి రైతులను పాలకులు ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి కనబడుటలేదు ఒక వైపున కవులు మరో వైపున పెరిగిన పెట్టుబడులు ఎరువుల ధరలు ట్రాక్టర్ ధరలు విపరీతంగా రైతులపై భారాలు మోపుతున్న ఈ పరిస్థితులలో గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వంలో క్వింటాళ్లకు 18000 ఉండగా పోయిన ప్రభుత్వంలో క్వింటా ఒక్కింటికి రూ.15000, రూ.16000 ఉండగా రైతు ప్రభుత్వం రైతుల కోసమే నేను పుట్టాను రైతు క్షేమమే నా సంక్షేమము మీ రైతు కుటుంబాల ఆర్థికంగా ముందుకు నడవాలి అలా నడిచిన నాడే రైతే రాజు అని వ్యక్తం చెప్పేటువంటి ఈ ప్రభుత్వ కాలంలో పసుపు క్వింటాలు రూ.9వేలుకు రావడం అనేటువంటి అత్యంత శోచనీయం. ఎకరాకు పెట్టుబడి రెండు లక్షల రూపాయలు అవుతున్నది. దిగుబడి 30 క్వింటాలు వస్తుంది. వెరసి సంవత్సరం ఒక ఇంటికి రైతుకు కూలి కూడా పడటం లేదని అటువంటి ఈ పాలకులు ప్రభుత్వాలు అర్థం చేసుకొని పండించినటువంటి పసుపు రైతులకు రూ.15వేల పై నుంచి రూ.16వేలు ఇచ్చినప్పుడే ఆ రైతు తిరిగి వ్యవసాయం చేయాలనేటువంటి ఒక ఆతృత సంకల్పంతోటి ముందుకు పోతాడు తప్ప లేకపోతే రైతు ఆత్మహత్తే శరణ్యమైనటువంటి పద్ధతిలో ఈనాడు నడుస్తుంది. కాబట్టి ప్రభుత్వాలు పాలకులు ఉన్నతాధికారులు ప్రత్యేకమైనటువంటి దృష్టి పెట్టి బెడ్జెట్లో రైతుకి గిట్టుబాటు ధరలకి మద్దతు ధరలకి అత్యధికంగా నిధులు కేటాయించి ఆ దిశగా రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్య ప్రభుత్వానికి పాలకులకు డిమాండ్ చేస్తున్నారు.

## వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**ఆత్మకూరు, జూన్ 1, ప్రభాతవార్త :** ఏరుదాటేదాక ఓడ మల్లన్న-ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్టుగా ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి గద్దె ఎక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని, చంద్రబాబు మోసపూరిత హామీలను ఎండగడుతూ జూన్4న నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్ఆర్‌సిపి నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల తో ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో జూన్4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఓటువేసిన వారిని వెన్నుపోటు పొడిచారని మోసపూర్తి వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమకేసులు పెట్టడం , వారి ఆస్తులను ధ్వంసం చేయడమే తప్ప అభివృద్ధి దిశగా అడుగులు వేయలేదని, వేల కోట్ల అప్పులు చేశారే కానీ ఏ సంక్షేమాన్ని అమలు చేయలేదన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన ఒక్క సంవత్సరంలోపే ప్రజలకు మానిఫెస్టోలో చెప్పిన హామీలను 90శాతం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారని, సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చూపించారని , కూమటి ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు జూన్ 4న ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్‌వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ఉదయం 10గంటలకు జరిగే వెను ్నపోటు దినం నిరసన ర్యాలీలో నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య, వైసిపి మండల కన్వీనర్లు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, బిజివేముల పిచ్చిరెడ్డి, వైసిపి రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ పులిమి రమేష్‌రెడ్డి, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ముతీవర్, ఎ.కోటిరెడ్డి , నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, సయ్యద్ జమీర్‌బాషా, షేక్ పర్వీన్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్పన, హేమ, కవిత, పాలేటి వెంగళరెడ్డి, జమ్రు, వినోద్ , కలాం, గోవర్ధన్, సురేంద్ర తదితరులుపాల్గొన్నారు.

## తహసిల్దార్ ఆఫీసులో 23పోస్టులు ఖాళీ



**వలేటివారిపాలెం, జూన్ 1, ప్రభాతవార్త :** వలేటివారిపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.దీంతో సకాలంలో పనులు పూర్తికావడం లేదు.ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి ఖాళీ పోస్టుల్లో సిబ్బందిని నియమించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.డిప్యూటీ తహసిల్దార్,సీనియర్ అసిస్టెంటు, ఆర్ఎస్‌డీటీ, 8మంది వీఆర్వోలు,9మంది సర్వేయర్లు వెరసి 23మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.అందుబాటులో ఉన్న సిబ్బందికి అదనపుబాధ్యతలు ఇచ్చారు.ఒక్కొక్క వీఆర్వోకి రెండుమూడు గ్రామాలు ఇన్‌చార్జీ ఇచ్చారు. వీరు ఏ రోజు ఎక్కడ ఉంటారో తెలియదు.ప్రజలు వివిధ పనులనిమిత్తం ఆయా గ్రామాల సచివాలయాలతోపాటు మండల రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న తహసిల్దార్ పదవీవిరమణ చేశారు.డిటీ ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు.అయితే తహసిల్దార్‌గా శీలం శ్రీనివాసరావు ఒంగోలు నుంచి వచ్చారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉండడంతో రెవిన్యూ పనులు అగమ్యగోచరంగా ఉన్నాయి.ఆన్‌లైన్ సవరణలు, భూకొలతలు, పట్టాదార్ పాస్‌బుక్‌లు, పక్కాఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్స్‌మంజూరు తదితర పనులు నిమిత్తం ప్రజలు కార్యాలయాల చుట్టూతిరుగు తున్నారు.రెండేళ్లుగా పనులు సకాలంలో పూర్తిచే యడంలో సిబ్బంది కొరత,సంబందిత అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు నిజానిజాలు విచారించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతు న్నారు.ఈ సందర్భంగా ఇటీవల విధుల్లో చేరిన తహసిల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉన్నప్పటికిని అందుబాటులో ఉన్న సిబ్బందితో సకాలంలో పనులు పూర్తిచేసెందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 1, ప్రభాతవార్త :** కావలి పట్టణానికి చెందిన పేరిశెట్టి మాధవరావు, ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు నాగసాయి సందీప్ వివాహ రిసెప్షన్ కార్యక్రమం కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణ మండపం నందు ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులను ఎప్పటిలాగే ఇళ్లవద్దనే ఇవ్వాలి



**కావలిరూరల్, జూన్ 1, ప్రభాతవార్త :** రేషన్ సరుకులను ఎప్పటిలాగే ఇళ్లవద్దకు రేషన్‌బండిని పంపించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం నెల్లూరుజిల్లా అధ్యక్షురాలు టి.శివకుమారి, కార్యదర్శి షేక్.మస్తాన్‌బిలు తెలియచేశారు. కావలి వైకుంతపురంలోని 36వ డివిజన్ నందు అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం నెల్లూరుజిల్లా అధ్యక్షురాలు టి.శివకుమారి, కార్యదర్శి షేక్.మస్తాన్‌బిలు మాట్లాడారు. 36వ డివిజన్ పరిధిలో రెండురోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేస్తున్నారని మహిళలు తెలియచేశారని అదే విధంగా మంచినీటి బోర్లు మరమ్మత్తులకు గురైఉన్నాయని వాటిని రిపేరు చేయించాలని తెలియచేశారు. మంచినీటిని రోజూ రెండుపూటలా సరఫరా చేయాలని కోరారు. రేషన్ సరుకులను రేషన్‌బండ్లు ప్రతినెలా వారి ఇళ్లవద్దకు సరుకులు ఇస్తున్నారని ఇక నుండి రేషన్ షాపులద్వారా సరుకులు తీసుకోవాలని అధికార పార్టీలు చెబుతున్నాయని తెలియచేశారు. దీని మూలంగా మహిళలకు ఇబ్బందికరంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారి పనులు చేసుకునేవారు షాపులు ఎక్కడో దూరంగా పెడితే వెళ్లి తెచ్చుకోవడానికి బియ్యం బస్తాలను దూరం నుండి మోసుకు రావాలన్నా ఇబ్బందులు ఉన్నాయని తెలియచేశారు. పనులు మానుకుని రేషన్‌షాపులకు వెళ్లాలంటే ఒకరోజు కూలీ పోతుందని తెలియచేశారు. గతంలోలాగానే రేషన్‌బండ్లను ఇంటివద్దకే పంపించి ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలని తెలియచేశారు. రేషన్‌బండ్లు ఇంటివద్దకు వస్తే వారు ఉదయం లేదా సాయంత్రం 5 గంటల తర్వాత వస్తున్నారని అందుకని ఆ సమయంలో అయితే రేషన్ సరుకులను ఇళ్లవద్దనే తీసుకోవడానికి అనుకూలంగా ఉండేదని వారు తెలియచేశారు. వైకుంతపురంలోని 36వ డివిజన్ చెరువుసంఘం, గిరిజనకాలనీ మహిళలతో 11 మందితో మహిళాసంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షురాలు మల్లీశ్వరి, కార్యదర్శి మడపల్లి శైలజ, ఉపాధ్యక్షురాలు తన్నీరు స్వర్ణ, సహాయక కార్యదర్శిగా మేడ విజయలక్ష్మిని, ఆఫీసు బేరర్స్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి సిపిఎంపార్టీ పట్టణ కార్యదర్శి పుసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు మడపల్లి రమణయ్య, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## జనసేన కిట్ల పంపిణీ కార్యక్రమం



**అల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త :** అల్లూరులో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ అలహరి సుధాకర్ పాల్గొన్నారు ముందుగా జన సైనికులు బైక్ ర్యాలీని అల్లూరుపేట లోని పోలేరమ్మ పెట్రోల్ బంకు వద్ద నుండి కోనేరు పుష్కరిణి వరకు బైక్ ర్యాలీ నిర్వహించగా ఈ ర్యాలీలో కావలి జనసేన పార్టీ ఇంచార్జ్. అల్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కార్తీక్ శర్మ. మండల అధికార ప్రతినిధి కత్తుల విజయ్ కుమార్ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జన సేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అలహరి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేశారని నాయకులకు కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## రేషన్ పంపిణీని ప్రారంభించిన తహసీల్దార్



**బిట్రగుంట, జూన్ 1, ప్రభాతవార్త :** బోగోలు మండలంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులు ప్రారంభించే విధానాన్ని మండల తహసీల్దార్ మలిశెట్టి సురేష్ కుమార్ టిడిపి నేతలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువులు అందరికీ అందుబాటులో ఉండే విధంగా సమయపాలన పాటిస్తూ వీటిని పునః ప్రారంభించిందాన్నారు. వినియోగదారులు వారిసౌలభ్యంను బట్టితీసుకోవచన్నారు. విశ్వనాధరావుపేట లో ప్రారంభించిన ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. నాగేశ్వరావు, ఎల్. సుధీర్ బాబు పార్టీ నేతలు అడపా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి: ఇస్కా



**జలదంకి, జూన్ 1, ప్రభాతవార్త :** రాష్ట్ర మాజి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 4న జిల్లా కేంద్రమైన నెల్లూరులో తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈసందర్భంగ ఆయన మండల పార్టీ నేతలు ఎస్వి శేషారెడ్డి,తమ్మినేని సతీష్‌బాబు,వాకా మహదేవరెడ్డి,బాబుల్‌రెడ్డి,ఆతిన శ్రీనివాసులయాదవ్,రామాల రమేష్‌రెడ్డి,వాకా శ్రీనివాసులరెడ్డి తదితరులతో కలసి ఆదివారం జలదంకిలో నిరసన పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈసందర్భంగ మదన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాదిపాలనపై దుమ్మెత్తిపోశారు.తన దగాకోరు పాలనతో చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అదోగతి పాల్జేస్తున్నాడని దుయ్యబట్టారు.ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ అంటుఊదరగొట్టిన చంద్రబాబు ఆదిశగ అడుగులు వేయడంలో ఘోరంగ విఫలమైనాడని అన్నారు.ఎస్వి శేషారెడ్డి మాట్లాడుతు ప్రజల్ని మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ కటిలత్వాన్ని ఎత్తిచూపారు చంద్రబాబునాయుడు మోసపుపాలనను మరోమారు రిపీట్ చేస్తున్నాడని దుయ్యబట్టాడు.కావున మండల పార్టీ శ్రేణులు,ప్రజలు పెద్దఎత్తున నెల్లూరుకు తరలి నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తిచేశాడు.

## వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** ఈ వేసవి సెలవుల్లో పిల్లలకు సంబంధించి విజ్ఞానాన్ని మరింత మెరుగుపరచేందుకు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సురేంద్ర అన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు , డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి ఈ శిబిరాలను తమకు అవసరమయ్యే రీతిలో మలుచు కోవాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు పి. రంగారెడ్డి, భాస్కర్‌రావు పిల్లలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

## పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు పంపిణీ



**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని చౌక డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. కోవూరులోని పలు చౌక డిపోలను తహసీల్దార్ నిర్మలానందబాబా ఆకస్మికంగా పరిశీలించి కార్డుదారులతో కూడా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మండలంలోని ప్రతి రేషన్ షాపులో జూన్ నెల 1వ తేది నుంచి 15వ తేది వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని, కార్డుదారులు ఈ సమయాలను తెలుసుకుని వారికి వీలైన వేళల్లో వచ్చి సరుకులు తీసుకుపోవాలన్నారు. అదేవిధంగా దివ్యాంగులు, వృద్ధులకు మాత్రం వారి ఇంటి వద్దకే రేషన్ అందించేలా సంబంధిత షాపుల డీలర్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. పోతిరెడ్డిపాలెం గ్రామంలోని షాపుల్లో సివిల్ స్లయిస్ డీటీ బాలకోటమ్మ సరుకుల పంపిణీని పరిశీలించారు. చౌక డిపో డీలర్ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, కోవూరు మండల రేషన్ షాపు అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున రావు, నేతలు అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, ఉన్నారు.

## పీఆర్ఎన్ ప్రధానోపాధ్యాయినిగా కిరణ్‌మయి



**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయిని కొత్తపాలెం నుంచి బదిలీ అయి వచ్చిన సోఫియా కిరణ్‌మయి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయినిగా ఉన్న ఝాన్సీరాణి బాధ్యతలను ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సోఫియా కిరణ్‌మయిని శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవికరాణి, ఉపాధ్యాయులు కరిమున్నిసా, భారతి, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

# ఘనంగా శ్రీరాములవారి దేవాలయ పునర్నిర్మాణోత్సవం



**వలేటివారిపాలెం, జూన్ 1, ప్రభాతవార్త :** మండలంలోని కాకర్లపాలెంలో శ్రీరాములువారి దేవాలయ పునర్నిర్మాణోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా గ్రామం మొత్తం మీద పునర్నిర్మాణ ఖర్చులతోపాటు గ్రామస్తుల వెచ్చించిన ప్రత్యక్ష పరోక్ష ఖర్చుల కలిపి దాదాపు రూ.2కోట్లు వెచ్చించారు.ఈ నెల 29తేదీ నుంచి మూడు రోజులుపాటు అన్నదానం,దేవతా మూర్తుల విగ్రహాలు ఊరేగింపు,ధ్వజస్థంభ ప్రతిష్టతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణను గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. ముగింపు సందర భ్ంగా శనివారం దేవతామూర్తులు శ్రీరాములువారు,సీతమ్మ, లక్ష్మణ,ఆంజనేయస్వామి విగ్రహాలను గర్భగుడిలోనూ,ఆలయం ఎదుట సుమారు 42అడుగుల ఎత్తు, దాదాపు 8టన్నుల బరువుగల ఏకరాతి విగ్రహాన్ని ఆలయప్రాంగణంలో ఉత్సవవిగ్రహాలను మంగళవాయిద్యాలు ,వేదమం త్రాల మద్య అత్యంతశోభాయిమానంగా ప్రతిష్ఠించారు. వీటి ఏర్పాటుకే సుమారు రూ.60లక్షలకి పైగా వెచ్చించారు.కార్యక్రమ నిర్వహణ ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.20లక్షలకి పైగా వెచ్చించారు. గ్రామంలో సుమారు 250 కుటుంబాలు ఉన్నాయి. ప్రతి కుటుంబంలో ఆడపడుచులకు చీరెలు బహుకరించారు.వీటి కొనుగోలుతోపాటు ఇతరత్రా ఖర్చులు నిమిత్తం ఒక్కొక్క కుటుంబానికి రూ.20 నుంచి 50వేలు దాకా వెచ్చించారు.ఈ లెక్కన పరోక్ష ఖర్చులుగా దాదాపు రూ.1 కోటి దాకా వెచ్చించారు. వెరసి సుమారు రూ.2 కోట్లు ఖర్చయినట్లు అంచనా. అయినా కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తివడంతో గ్రామస్తుల హర్షం వ్యక్తం చేస్తున్నారు

**.కళక ళలాడిన కాకర్లపాలెం:**ఈ కార్యక్రమం సందర్భంగా కాకర్లపాలెంలో మూడు రోజుల పాటు సందడి వాతావరణం నెలకొంది.బంధుమిత్రుల కలయికతో కళకళలా డింది. వివిధ వృత్తులరీత్యా బెంగుళూరు,హైదరాబాదు,కందుకూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారితోపాటు కాకర్లపాలెం గ్రామ ఆడపడుచులు,వివిధ గ్రామాల్లో ఉన్న బంధు మిత్రులు హాజరైనారు.ముగింపు సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కాకర్లపాలెం విచ్చేశారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, తెదేపా నేత కాకుమాని హర్షకుమార్, ఎంపీడీవో కె.నరేంద్రదేవ్, సచివాలయ పీఎస్‌రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంటు సుప్రజ, తదితరులు పాల్గొన్నా రు. పునర్నిర్మాణ ఆవశ్యకత ఏంటంటే:గ్రామ పూర్వీకులు గ్రామంలో ఆనాటి పరిస్థితుల దృష్ట్యా రామాలయం నిర్మించారు.ఈ ఆలయం అనుకూ లంగా లేదని సుమారు మూడేళ్ల కిందట గ్రామస్తులు బావిం చారు.జీప్లస్ ఇళ్ల నిర్మాణానికి సైతం సమంజసం కాదన్న వేద పండితులు సూచనలూ వెలుగులోకి వచ్చాయి .దీంతో గ్రామస్తు లంతా ఐక్యమైనారు. ఆలయ పునర్నిర్మా ణానికి సంకల్పిం చారు. గోపురం ,ధ్వజస్థంబంతో ఆలయా న్ని పునర్నిర్మి ంచాలని కంకణం కట్టారు .ప్రభుత్వ సహకారం ఆశించారు.అంచనా విలువ ఎక్కువగా ఉండడంతో విరాళాల బాటపట్టారు. ప్రతికుటుంబం నుంచి సేకరించారు. బెంగుళూరు ,హైదరాబాదు, కందుకూరు తదితర పట్టణాల్లో వివిధ వృత్తులతో స్థిరపడిన గ్రామస్తులతోపాటు బంధు మిత్రలునుంచి విరాళాలు సేకరించారు. విరాళాలతోపాటు ధ్వజస్థ ంభం,విగ్రహాలు,ప్రహరి తదితర కట్టడాలుకు సైతం దాతలు ముందుకు వచ్చారు. సుమారు ఏడాది కిందట నిపుణులతో పునర్ని ర్మాణం ప్రారంభించారు. పూర్తివడంతో ఈ నెల 29 నుంచి అంగరంగ వైభవంగా గ్రామంలో తిరు ణాల నిర్వహించి విగ్రహాలు ధ్వజస్థంభం ప్రతిష్ఠించారు .యాదవలు,వాల్మికి బోయలు, రజకులు వరుసగా సొంత నిదులు వెచ్చించి మూడు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 6వేల మందికి పైగా అన్నదానంలో పాల్గొన్నారు.

### వివిధ పద్దుల కింద రూ.2 కోట్లు వెచ్చించిన వైనం



## రేషన్‌షాపుల వద్ద సరుకులు ఇవ్వడం ప్రజలకు ఎంతో ఉపయోగకరం : దొడ్ల కోదండరామిరెడ్డి



**బుచ్చి, జూన్ 1, ప్రభాతవార్త :** నెలలో 15 రోజులు రేషన్‌షాపులలో రెండు పూటలా బియ్యం ఇవ్వడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని టిడిపి సీనియర్‌నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి ప్రశంసించారు. గత ప్రభుత్వం హయాంలో వ్యాన్లులలో రేషన్ బియ్యం తెచ్చి ఒక్క సెంటర్‌లో పెట్టి ఇచ్చారు. ఆవ్యాను కోసం పనులు ఆపుకొని ప్రజలు వేచి ఉండాల్సి వచ్చేదని అన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత పద్ధతిలో రేషన్‌షాపులలో నెలలో 15 రోజులు పాటు ఉదయం,సాయింత్రం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందని అన్నారు. కూలీనాలి చేసుకొని వచ్చే వారు సాయింత్రం 7 గంటలకు కూడా రేషన్ షాపు వద్దకు వెళ్ళి బియ్యం తెచ్చుకోవచ్చునని ఇది ఎంతో శుభపరిణామమని అన్నారు. కోనేటి మిట్టలో 33వ రేషన్‌షాపు వద్ద ఆయన రేషన్ సరుకులు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు పాత విధానం తీసుకొని వచ్చి మంచి పనిచేశారని అన్నారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు రేషన్ షాపుల వద్దకు వెళ్లి సరుకులు పంపిణి చేయడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో డీలర్ కీలుకుప్ప శ్రీనివాసులు,సునీల్, గ్రామ ప్రజలున్నారు.

## రేషన్ పాతవిధానం పై ప్రజల హర్షం

### ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు



**బుచ్చి, జూన్ 1, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామ పంచాయితీ పరిధిలోని నెహ్రూ నగర్‌లో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ డిటి మల్లికార్జున, గ్రామ సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మీ, ఏటూరు శివరామకృష్ణారెడ్డి రేషన్ షాపు వద్ద బియ్యం పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఎంపిపి శ్రీనివాసులు మాట్లాడుతు రేషన్ షాపుల వద్ద రోజుకు రెండు పూటలా బియ్యం ఇవ్వడం వల్ల కూలీనాలీ చేసుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటందని అన్నారు.గతంలో అయితే వ్యాను కోసం వేచి చూడాల్సి వచ్చేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ఇబ్బందులు గ్రహించి పాత విధానానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన అబినందించారు. ప్రతి నెల 15 వతేది వరకు రేషన్ షాపు వద్ద రేషన్ సరుకులు ఇవ్వడం జరుగుతుంది దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాను సారం మండలంలో ప్రతి రేషన్ షాపు వద్ద ఆదివారం అయినప్పటికి తహసిల్దారు,రెవిన్యూ అదికారులు వచ్చి బియ్యం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ప్రజలందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు లఘంతోటి మస్తానయ్య, నీటి సంఘం అధ్యక్షులు రమణారెడ్డి,మైనార్టీనాయకులు ఫయాజ్ పలువురు టిడిపినాయకులు పాల్గోన్నారు.

## రేషన్ షాపుల దగ్గరే రేషన్ సరుకుల పంపిణీ



**దగదర్తి, జూన్ 1, ప్రభాతవార్త** మండల ప్రాంతమైన కౌరుగుంట గ్రామంలో అధికారులు, నాయకులతో కలిసి రేషన్ పంపిణీ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. కౌరుగుంట గ్రామంలో కొంతమంది గ్రామ ప్రజలకు రేషన్ పంపిణీ చేశారు. తరువాత ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన డోర్ డెలివరి కార్యక్రమం వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారని, డోర్ డెలివరి అని చెప్పి వీధి చివర బండి పెట్టి ప్రజల్ని రోడ్డు మీద నిలబెట్టి ఇబ్బందులు పెట్టారని, గంట రెండు గంటల ఉండి వెళ్లిపోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం ప్రతి నెల ఒకటి నుండి 15వరకు రెండు పూటల సరుకుల పంపిణీ ఉంటుందని తెలిపారు. నీకు ఎప్పుడు వీలైతే అప్పుడు 15వ తేదీ లోపల ఎప్పుడైనా తీసుకోవచ్చని అంతే కాకుండా మీరు ఎక్కడైనా బయటకు వెళ్లినట్లయితే ఆ ఊరిలోని షాపు దగ్గర రేషన్ తీసుకోవచ్చని చెప్పారు. వృద్దులు, దివ్యాంగులకు 5వ తేదీ లోపల డోర్ డెలివరి ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ కృష్ణ మండల అధి కారులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లి మందలించడంతో బాలిక ఆత్మహత్య



**ఉదయగిరి, జూన్ 1, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గాలేటి నవ్య (18) ఫ్యాన్‌కు ఉరేసుకుని శనివారం సాయంకాలం బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన గాలేటి వన్య ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినది చుట్టు పక్కల వారు గమనించి వెంటనే తలుపు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. నవ్యాను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన స్థలానికి చేరుకుని ఎస్సై ఇంద్రసేనారెడ్డి విచారణ చేపట్టారు.

## బులియన్,డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక



**నెల్లూరు, జూన్ 1 ప్రభాతవార్త-విద్య:** నెల్లూరుజిల్లా బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎంపికైంది. నగరంలోని స్థానిక ఆచారివీధిలోని ది నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం 150మందికి పైగా సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ శాశ్వత అధ్యక్షులుగా శాంతిలాల్ జైన్, శాశ్వత నిర్వహణ కార్యదర్శిగా మణిలాల్ జైన్, ఉపాధ్యక్షులుగా జేఎల్ సత్యంలు ఎంపికైయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా అర్కట్ శ్రీనివాసులు, కోశాధికారిగా కైలాష్ జైన్, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ జైన్‌లు ఎంపికైయ్యారు. కన్వీనర్‌గా జి.కిషోర్‌కుమార్, సలహా కమిటీ సభ్యులుగా జి.శంకర్‌లాల్‌జైన్, డి.ప్రబాకర్, అలిమెలి సుబ్రహ్మణ్యం, ఎంపి.అంజనేయులు, ఫయాజ్‌లు ఎంపికైయ్యారు. ఎంపికైన నూతన కమిటీ 2025 నుండి 2028 వరకు మూడుసంవత్సరాల పాటూ అధికారంలో ఉంటుందని కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్కట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు రెండు రోజుల తరువాత సమావేశం నిర్వహించి ఇతరకార్యవర్గ సభ్యులను ఎన్నుకోవటం జరుగుతుంద న్నారు. వ్యాపారుల సమస్యలు పరిష్కరించేందుకు తాము శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఈపి లక్ష్యాలను సాధించేలా యూనివర్శిటీలకు ఎన్ఐఏటి చేయూత

**నెల్లూరు, జూన్ 1 ప్రభాతవార్త-విద్య :** జాతీయ విద్యావిధానం (ఎన్ఈపి) 2020 లక్ష్యాలను సాధించేందుకు దేశంలోని యూనివర్శిటీలకు చేయూతను అందించటమే తమ లక్ష్యమని నెక్ట్‌వేవ్,ఎన్ఐఏటి కో ఫౌండర్,సిఈఓరాహుల్ అత్తులూరి పేర్కొన్నారు.ఆదివారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతు ఇండస్ట్రీకి అసవరమైన నైపుణ్యాన్ని విద్యార్థులు కళాశాల రోజు ల్లోనే అలవరచుకుని ఉత్త మ ప్రతిభా వంతులుగా ఎదిగేందుకు తాము కృషిచేస్తున్నామన్నారు. యూని వర్శి టీల అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను తమదైన విధంగా కొనసాగిస్తూ మరోవైపు ఇండస్ట్రీకి సిద్ధమవ్వడానికి అవసర మైన హ్యాండ్స్ ఆన్ స్కిల్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుండి తరగతులు, ప్యాకల్టీ ట్రైనింగ్,ఇంటర్న్‌సిప్, ప్లేస్‌మెంట్స్ ఇలా అనింటిలో తాము సహాయ కారిగా ఉంటామన్నారు. ఇన్‌సైట్స్‌లో 3000కుపైగా కంపెనీలతో ఒప్పందం, 10 వేలకు పైగా కమ్యూనిటీలతో డెవలప్‌మెంట్ మూలాలను సేకరిస్తున్నామన్నారు. అధునాతన టెక్నాలజీతో ప్రాక్టికల్ స్కిల్స్ పెంపొందేలా ప్యాకల్టీకి శిక్షణ ఇవ్వటం తమ ముఖ్యమైన అంశమన్నారు. ప్రపంచ స్థాయి నిపుణుల్లా తయారు అవ్వాలంటే డిగ్రీతోపాటూ స్కిల్స్, యాప్టిట్యూడ్ అవసరమని తెలిపారు. ఇందుకోసం తమ సంస్థ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన లెర్నింగ్ ప్లాట్‌ఫాంలను సైతం యూనివర్శిటీలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో నూతన అధ్యయనానికి శ్రీకారం





**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** గత ప్రభుత్వంలో మాదిరిగా వ్యాన్‌ల కోసం ఎదురుచూడడం, వీధుల చివర నిల్చోవడం, సెలవులు పెట్టి వ్యాన్ ఎప్పుడు వస్తుందా అని వేచి చూడడం లేకుండా ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు రేషన్ షాపుకు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని షాపు నెంబర్ 12 కుద్దూస్ బాషా షాపులో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రేషన్ వ్యాన్‌ల పేరుతో బియ్యం స్మగ్లింగ్ చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. గతంలో రేషన్ కావాలంటే వ్యాన్ వచ్చిన రోజు మాత్రమే వీధి చివర నిలబడి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదని, ఆ రోజు రాకపోతే ఇంక ఆ నెలలో సరుకులు మంగళమే అన్నారు. ప్రస్తుతం అందుకు స్వస్తి చెప్పి ప్రతి నెల 15 రోజుల పాటు రేషన్ షాపులోనే సరుకులు ఇచ్చేలా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. షాపుకు సంబంధించి డీలర్లు ఏమైనా ఇబ్బందులు పెడితే ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లచ్చన్నారు. రేషన్ షాపులు కూడా సకాలంలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రికి, సివిల్ స్లయిస్ మంత్రికి, ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబాఎంపీడీవో శ్రీహరిరెడ్డి,డిఎస్ విజయ్‌కుమార్, డిఎం సివిల్ సప్లై అర్జున్‌రావు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, రేషన్ డీలర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల రేషన్ డీలర్ సంఘం అధ్యక్షులు మలికార్జునరావు, పెన్నాడెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడి, నల్లపరెడ్డి సురేష్‌రెడ్డి,,జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడమండల పార్టీ అధ్యక్షులు కె. సుధాకర్‌రెడ్డి,మాజీ ఎంపీపీ వై. రమణమ్మ, నేతలు బెజవాడ వంశీకృష్ణారెడ్డిజొన్నవాడ దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ టి. అశోక్‌రెడ్డి, అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, ఇంతా మల్లారెడ్డి, బాలరవి, ఎన్.వెంకట్, ఎం. సుధాకర్, , కె. శ్రీనివాసులు, సర్పంచ్, వై. విజయ, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్‌రెడ్డి డీలర్ల సంఘం నేతలు వై కోటిలింగాలు, బాస్కర్ సాదిక్ శ్రీనివాసులు, కుద్దూస్ బాషాను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడి ప్రత్యేకంగా అభినం దిం చారు. కూటమి నేతలు సుబ్బారావు, చక్రవర్తి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మున్వర్‌బాషా, అల్తాఫ్, ఉన్నారు.

## హామీలు నెరవేరుస్తున్న కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, జూన్ 1 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతు న్నారు. రెండు నెలల క్రితం కోవూరు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ సమావేశానికి వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్, వైద్యులు మంచినీటి సమస్య ఉందని, ఈ కేంద్రంలో ఒక వాటర్ ప్లాంట్ కావాలని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి ఈ సా మాజిక ఆరోగ్య కేంద్రంలో వీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. అదేవిధంగా స్థానిక పీఆర్ఎన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు మంచి నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి ట్రస్టు ద్వారా వసతి గృహ ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శుక్ర, శనివారాల్లో ఈ రెండు చోట్ల వాటర్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం పట్ల అటుసామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యులు,రోగులు, ఇటుసంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నేత్ర పర్వంగా శ్రీ వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవం





**నెల్లూరు,జూన్1 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక బాలాజీనగర్, పద్మావతి నగర్‌లోని శ్రీ సాయి ధర్బార్ అద్దాల మందిరం 20వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వరుని కళ్యాణ మహోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలు, అన్నమయ్య కీర్తనలు, పండరీ బజనలతో స్వామివారి కళ్యాణం రమణీయంగా సాగింది. ఈ మహోత్సవంలో వేదగిరి ఫణిశర్మ స్వామి, దాశరధి స్వామిలు పాల్గొని కళ్యాణం గావించగా ఉభయ కర్తలుగా కృష్ణగిరి దేష్పాల్ సింగ్, దేవకీదేవీలు వ్యవహరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రదాన వితరణ చేపట్టారు. కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు అందరికి ముత్యాలు, అక్షింతలను అదించాగా భక్తులు స్వామివారి కళ్యాణాన్నిదర్శించి,తీర్ధ ప్రసాదాలు స్వీకరించి తరించారు.ఈ సందర్బగా ఆయన నిర్వాహకులు మధుసాయి మాట్లాడుతు తమ ఆలయం 20వ వార్షికోత్సవ వేడుకలను గత రెండు రోజులుగా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ గౌరవసలహాదారులు పాబోలు రామసుబ్బయ్య, బాబీ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇనుపరాడ్డుతో వ్యక్తిపై దాడి.. వ్యక్తికి బలమైన గాయాలు

**కావలిరూరల్ జూన్ 1, ప్రభాతవార్త :** కావలి ముసునూరులోని బలిజపాలెంకు చెందిన చింతలపూడి హరి కృష్ణ చింతలపూడి ప్రసాద్‌పై ఇనుపరాడ్డుతో దాడిచేయగా ప్రసాద్‌కు బలమైన గాయాలు కావడం జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు ముసునూరులోని బలిజపాలెంకు చెందిన చింతలపూడి హరి కృష్ణ,అతని చిన్నాన్న కుమారుడైన చింతలపూడి ప్రసాద్ ఇద్దరూ అన్నదమ్ములు ఒకే ఇంట్లోఉంటూ తాగి తిరుగుతూ ఉండేవారనితెలిపారు. ఈ క్రమంలో మే 31వ తేదీ రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో తాగి ఒకరినొకరు తిట్టుకుంటూ గొడవపడ్డారని తెలియచేశారు. తాగిన మైకంలో హరికృష్ణ పక్కన ఉన్న ఇను పరాడ్డును తీసుకుని ప్రసాద్‌తలపై బలంగా దాడిచేయగా తలకు బలమైన రక్తగాయం అవడం జరిగిందని తెలియచేశారు. ప్రసాద్‌ను చికిత్సనిమిత్తం కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షచేసి మెరుగైన చికిత్సకోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లమని తెలియచేశారు. ప్రసాద్ అత్త కుల్లూరు సు కన్య కావలి రూరల్ పోలీసుస్టేషన్ నందు ఆదివారం ఫిర్యాదుచేయడం జరిగింది. ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వీఆర్ హైస్కూల్ పున:ప్రారంభ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

- 10వ తేదీ కల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం
- పనుల్లో వేగం పెంచిన ఎన్‌సీసీ సిబ్బందిని అభినందించిన మంత్రి
- ప్లేగ్రౌండ్, డిజిటల్ క్లాస్ రూమ్స్, స్కూల్‌లో వసతులు క్షుణ్ణంగా పరిశీలన



**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త- వైద్యం** నెల్లూరు వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న పున:ప్రారంభ పను లను రాష్ట్ర పురపాలక, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకస్మికంగా పరిశీలించా రు. హైస్కూల్లోని ప్రతి తరగతి గదికి వెళ్లి జరుగుతున్న పనులపై ఆరాతీశారు. క్లాస్‌రూమ్‌లో ఏర్పాటు చేసిన డిజి టల్ స్క్రీన్‌లను పరిశీలించా రు. ఇంకా చేపట్టాల్సిన పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 10వ తేదీ కల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్లేగ్రౌండ్ ఎక్విప్‌మెంట్‌పై పలుసిబ్బందిని మంత్రినారాయణఅభినందించారు. డిజిటల్ విద్యకు సంబంధించిన పరికరాలు, ఫర్నిచర్, తదితర అంశాలపై ఎన్‌సీసీ సిబ్బందిని అడిగి తెలుసుకుని ఇంకా ఏమేమి కావాలో అన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు.

## రేషన్ పాత విధానాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలి

### టిడిపి మండలాధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి



**సంగం జూన్ 1 ప్రభాతవార్త** రేషన్ పాత విధానాన్ని ప్రజ లందరు సద్వినియోగం చేసు కో వాలని టిడిపి మండలాద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి కోరారు. మండలకేంద్రమైన సంగంలోని పలు రేషన్ షాపులలో ఆయన తహాసిల్దారు సోమ్లానాయక్, సవిల్ సప్లయ్ డిటి మల్లికార్జున, తో కలిసి రేషన్ సరుకులు పంపిణి చేశారు. మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఏది చేసిన ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా చేస్తారని అన్నారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాను సారం మండలంలోని అన్ని రేషన్‌షాపులలో రేషన్ బియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు.నెలకు 15 రోజులు రేషన్ సరకు ఇవ్వడం జరుగు తుందని అన్నారు. రెండు పూటలా ప్రజలకు ఎప్పుడు వీలు ఉంటే అప్పుడు తెచ్చు కోవచ్చునని,ఇకపైన వేచి చూడాల్సిన అవసరం లేదని అన్నారు. వృద్దులకు, దివ్యాంగులకు, 60 సంవత్సరాలు పై బడిన వారికి ఇం టికి తీసుకొని వచ్చి రేషన్ సరుకులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రజలందరు కూడా రేషన్‌షాపుల వద్ద రేషన్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. నీటి సంఘం అధ్యక్షులు బాబు, మాగంగిరి, పలువురు టిడిపినాయకులు,రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## మూలపేట పాఠశాలను పరిశీలించిన మంత్రి నారాయణ

- పాఠశాలను దత్తత తీసుకున్న డీఎస్ఆర్ కనస్ట్రక్షన్ వారిని అభినందించిన మంత్రి
- జూన్ 12లోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశాలు
- ప్రభుత్వ తోడ్పాటుతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి దిశగా సర్కారు బడులు



**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త- వైద్యం** నెల్లూరు నగర నియోజక వర్గ పరిధిలోని మూలపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదివారం నగర పాలక సంస్థ కమీషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలలో తరగతి గదుల స్థితిగతులపై ఆరా తీశారు. నిరూపయోగంగా మారిన హెడ్ మాస్టర్ రూంను మంత్రి పరిశీలించారు. పాఠశాలను దత్తత తీసుకుని ఆధునీకరించేందుకు ముందుకొచ్చిన డీఎస్ఆర్ కనస్ట్రక్షన్ వారిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు దాతల సహకారంతో సర్కారు బడుల రూపురేఖలు మారనున్నాయని మంత్రి తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్ఆర్ కనస్ట్రక్షన్స్ ప్రతినిధులకు మంత్రి నారాయణ పలు సూచనలు చేశారు. పాఠశాలలో పది తరగతి గదులు, ల్యాబ్ అండ్ మ్యూజిక్ రూములు, ప్లే గ్రౌండ్ పనులు తొలుత ప్రారంభించాలని మంత్రి వారికి సూచించారు. జూన్ 12 కల్లా పెయింట్లతో సహా పనులు పూర్తి అయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నిరూపయోగంగా ఉన్న హెడ్ మాస్టర్ రూంని తొలగించాలని సూచించారు. ఈ క్రమంలో మూలపేట పాఠశాలను పరిశీలిచేందుకు వచ్చిన మంత్రికి స్థానిక ప్రజలు టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి నారాయణతో ఫొటోలు దిగేందుకు విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పోటీపడ్డారు. కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, స్థానిక టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల వద్దే రేషన్ పంపిణీతో ప్రజలకు మేలు

**ఇక రేషన్ ఎప్పుడైనా తీసుకోవచ్చు**
**త్వరలోనే మరిన్ని సరుకులు అందించేందుకు ప్రభుత్వం కృషి**
**రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీని ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ**



**నెల్లూరు, జూన్ 1, ప్రభాతవార్త-వైద్యం** కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన రేషన్ దుకాణాల వద్ద నిత్యావసరాల పంపిణీ వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని నెల్లూరు పా ర్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అ న్నారు. రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొం గూరు నారాయణగారితో కలిసి ఆయన ఆదివారం జనార్ధన రెడ్డి కాలనీలో 102 నెంబర్ రేషన్ డిపో వద్ద పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి



మంత్రి మాట్లాడుతూ ఎండియు వాహనాల ద్వారా రేషన్ ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని, రేషన్ షాపుల ద్వారా అందించాలని ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎవరూ తమ పనులు మానుకొని రేషన్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చని తెలిపారు. ఈ పాత విధానం ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. రేషన్ దుకాణాల్లో తక్కువ ధరకే మరిన్ని సరుకులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.మంత్రి నారాయణ గారు మాట్లాడుతూ.. ఎండియూ వాహనాల ద్వారా రేషన్ ఇచ్చే విధాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని, రేషన్ షాప్ ల ద్వారా అందించాలని ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 1 కోటి 46 లక్షల కార్డ్స్ ఉన్నాయని, ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుందని, 65 సంవత్సరాలుపై బడిన వారికి దివ్యాంగులకు 1 వ తేదీ నుండి 5 వ తేదీలోగా ఇళ్ల వద్దే అందించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 42 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం పథకం ప్రారంభమైనప్పటి నుంచి రేషన్ షాపులు అలాగే పనిచేసేవి..ఈ ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం మార్చి గందరగోళానికి తెరలేపిందన్నారు. MDU వాహనాలకోసం 1800 కోట్లు ఖర్చుచేసి, సక్రమంగా అందించక ప్రజలను ఇబ్బందులు పెట్టిందన్నారు.ఇంచార్జి కలెక్టర్ కార్తిక్, డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్‌యాదవ్,తహసీన్ తదితరులు ఉన్నారు.